నమస్తే తెలంగాణ

మహబూబాబాద్

5 | మంగళవారం 6 ఆగస్టు 2024 | MAHABUBABAD


## నేడు జయశంకర్ జయంతి వేడుకలు



హనుమకొండ, ఆగస్టు 5: తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ భావ జాల వ్యాప్తి కోసం తన జీవితాన్ని అర్పించిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. మలిబు దశ ఉద్యమానికి దిక్సూచిగా తెలంగాణ జన హృదయాల్లో నిలిచిన ఆయన రాష్ట్ర సాధనకు కోసం చేసిన త్యాగం మరువలేనిది. సబ్బండ వర్గాల సమగ్రాభివృద్ధి కోసమే తెలంగాణ స్వరాష్ట్రం అని తెలిపిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ ప్రస్తుత హనుమకొండ జిల్లాలోని ఆత్మకూరు మండలం అక్కంపేటలో 1934 ఆగస్టు 6న జన్మించారు. అతను తెలంగాణ సాధన కోసం ఎనలేని కృషి చేశాడు. ఆయన గుర్తుగా కుడా ఆధ్వర్యంలో బాలసముద్రంలోని ఏకశిలా పార్కుకు జయశంకర్ స్మృతి వనంగా పేరుపెట్టారు. నేడు ఆయన జయంతి వేడుకలను పురస్కరించుకొని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల్లో వేడుకలు జరుపుకోనున్నారు. హనుమకొండలోని ఏకశిల పార్కులో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే వేడుకలో కలెక్టర్ ప్రావీణ్య, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొననున్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు

## అర్హులకు సకాలంలో రుణాలు ఇవ్వాలి

**టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు**

సుబేదారి, ఆగస్టు 5 : అర్హులైన వారికి సకాలంలో రుణాలు మంజూరు చేయాలని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు బ్యాంకు అధికారులను ఆదేశించారు. సోమవారం నక్కలగుట్టలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో రుణమాఫీ, కొత్త రుణాల పాలసీ, డిపాజిట్లపై బ్యాంకు అధికారులతో సమీక్షించారు. పంటరుణాలు మాఫీ అయిన రైతులకు మళ్లీ కొత్త రుణాలు వెంటనే ఇవ్వాలని, డిపాజిట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సమావేశంలో బ్యాంకు సీఈవో వజీర్ సుల్తాన్, జీఎం ఉష, అధికారులు పాల్గొన్నారు.

**కాకతీయ యూనివర్సిటీలో రెగ్యులర్ వైస్ చాన్స్‌లర్‌ను నియమించకపోవడంతో పాలన కుంటుపడుతోంది. ఇన్‌చార్జి వీసీ సైతం దృష్టి కేంద్రీకరించకపోవడంతో మూడు నెలలుగా ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట వేశాయి. వాటిని ఇన్‌చార్జి వీసీకి తెలియజేయడంలో రిజిస్ట్రార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు ఆరోపిస్తున్నారు. సైన్స్ ఫ్యాకల్టీకి డీన్‌ను నియమించకపోవడం, ప్రొఫెసర్ల ప్రమోషన్లలో జాప్యం చేయడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.**

– హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 5



కేయూ పరిపాలనా భవనం

# వీసీ లేక.. సమస్యలు తీరక

- యూనివర్సిటీలో కుంటుపడుతున్న పాలన
- సైన్స్ డీన్, పార్ట్‌టైం నియామకాలు, ప్రొఫెసర్ల ప్రమోషన్లలో జాప్యం
- ప్రిన్సిపాల్ లేకుండానే ఇంజినీరింగ్ కాలేజీ
- సమస్యలపై ఇన్‌చార్జి వీసీ చొరవ చూపేనా?

## కేయూ రెగ్యులర్ వైస్ చాన్స్‌లర్ నియామకం ఎప్పుడో ?

యూనివర్సిటీ సైన్స్ విభాగాల్లో పనిచేసే ప్రొఫెసర్లలో సీనియర్‌కు డీన్ బాధ్యతలు ఇవ్వాల్సి ఉంది. మే 31న రిజిస్ట్రార్ మల్లారెడ్డి డీన్‌గా పదవీ కాలం పూర్తయింది. ఆ తర్వాత సీనియర్‌ను నిర్ణయించడంలో వివాదం నెలకొంది. గతంలో ఇలాంటి వివాదం తలెత్తినప్పుడు మొదట అపాయింట్ అయిన వారికే డీన్ బాధ్యతలను అప్పజెప్పారు. నిబంధనల ప్రకారం చూస్తే మల్లారెడ్డి తర్వాత కెమిస్ట్రీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ హన్మంతుకు ప్రస్తుతం ఫ్యాకల్టీ ఆఫ్ సైన్సెస్ డీన్ అయ్యే అవకాశం ఉండగా, రిజిస్ట్రార్ మల్లారెడ్డి తన సామాజికవర్గానికి చెందిన వారిని నియమించేందుకే జాప్యం చేయడానికి ప్రయత్నం చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

**ఇంజినీరింగ్ కాలేజీకి ప్రిన్సిపాలేడీ?**

కేయూ కో ఎడ్యుకేషన్, మహిళా ఇంజినీరింగ్ కాలేజీలకు రెగ్యులర్ ప్రిన్సిపాల్‌ను ఇప్పటి వరకు నియమించలేదు. ఒక్కరినే ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా కొనసాగించడంలో విమర్శలు తలెత్తుతున్నాయి. కొత్తగూడెం ఇంజినీరింగ్ కాలేజీలో రెగ్యులర్ ప్రొఫెసర్లు ఉన్నప్పటికీ వారిని ప్రిన్సిపాల్‌గా చేసే అవకాశం ఉన్నప్పటికీ రిజిస్ట్రార్ మల్లారెడ్డి తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఈ విషయాన్ని ఇన్‌చార్జి వీసీ దృష్టికి తీసుకెళ్లడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**పార్ట్‌టైం నియామకాలు, ప్రొఫెసర్ల ప్రమోషన్లలో జాప్యం**

కేయూలోని 28 విభాగాల్లో సరైన సంఖ్యలో ప్రొఫెసర్లు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పార్ట్‌టైం టీచింగ్ అవసరాలు ఉన్నప్పటికీ ఇప్పటివరకు డిపార్ట్‌మెంట్ కమిటీ ద్వారా ఎలాంటి నియామకాలు జరపలేదు. కొత్త నియామకాలు లేక, విద్యార్థుల కు సరైన సమయంలో సిలబస్ పూర్తికాక పరీక్షలను వాయిదా చేయాల్సిన పరిస్థితి ఎదురైందని విద్యార్థి సంఘాలు పేర్కొంటున్నాయి. కేయూలో అసిస్టెంట్ ప్రొఫెసర్లకు వివిధ గ్రేడుల్లో పదోన్నతి పొందడానికి రెండు నెలల కిందట ఆకుట్ డిమాండ్‌తో నోటిఫికేషన్ జారీ చేసినా వీసీ లేకపోవడంతో ఇప్పటివరకు పదోన్నతుల ప్రక్రియ ముందుకు కదలడం లేదు. ఇప్పటికే రెండు సార్లు గడువు పెంచగా, వీసీ రానంతవరకు ఇలా గడువు పెంచుకుంటూపోతే పదోన్నతులు రాక నష్టపోయే పరిస్థితి ఎదురవుతుందని టీచర్లు ఆందోళన చెందుతున్నారు. ఇన్‌చార్జి వీసీ చొరవ తీసుకొని పదోన్నతుల ప్రక్రియ తొందరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

**సమస్యలు పరిష్కరిస్తున్నాం..**

యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలను ఇన్‌చార్జి వీసీ దృష్టికి తీసుకెళ్లి ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. నిబంధనల ప్రకారమే సైన్స్ డీన్‌ను నియమిస్తాం. సీనియారిటీ, క్యాడర్ ప్రకారం ఇద్దరిని కూర్చోబెట్టి మాట్లాడుకుని వారినే నిర్ణయం తీసుకొమ్మని ఇన్‌చార్జి వీసీ చెప్పారు. రెండు రోజుల్లో వారినే డిసైడ్ చేసుకొమ్మని చెబుతాం. 17 సంవత్సరాల్లో నా సామాజికవర్గం అంటూ ఎప్పుడూ చూడలేదు. 2010 పదోన్నతుల విషయంలో సర్వీస్ ప్రాబ్లం ఉంది. కోర్టులో ఉంది. అందుకే ఆలస్యమవుతోంది. పార్ట్‌టైం నియామకాలను ప్రభుత్వం రద్దు చేసింది. వాస్తవానికి యూనివర్సిటీకి డబ్బుల్లేవు. ఇంజినీరింగ్ కాలేజీలకు కూడా ఇద్దరు ప్రిన్సిపాళ్లను నియమించాల్సి ఉంది. మేడం దృష్టికి తీసుకెళ్లాం.

– పెరటి మల్లారెడ్డి, కేయూ రిజిస్ట్రార్

## స్వచ్ఛదనం.. పచ్చదనంలో భాగస్వామ్యం కావాలి

**ప్రజలకు మంత్రులు సురేఖ, సీతక్క పిలుపు**

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రారంభమైన కార్యక్రమం
- విద్యార్థుల ర్యాలీలు.. మానవహారాలు
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, అధికారులు



స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా రోడ్డు ఊడుస్తున్న మంత్రి సురేఖ, మేయర్ సుధారాణి, ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్



ఏటూరునాగారంలోని ఉద్యాన నర్సరీలో మొక్క నాటి నీరు పోస్తున్న మంత్రి సీతక్క

నమస్తే నెట్‌వర్క్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా అధికారులతో కలిసి విద్యార్థులు మొక్కలు నాటడంతో పాటు ర్యాలీలు నిర్వహించి ప్రధాన కూడళ్లలో మానవహారాలు చేపట్టారు. స్వచ్ఛదనం-పచ్చదనంపై అవగాహన కల్పించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్యాలయంలో మంత్రి సురేఖ, ములుగు జిల్లా అబ్బాపురంలో మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంజీఎం సెంటర్‌లో మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్, మేయర్ గుండు సుధారాణి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు పీ ప్రావీణ్య, సత్యశారద, జీడబ్ల్యూఎంసీ కమిషన్ అశ్విని తానాజీ వాకడే తదితరులతో కలిసి సురేఖ రోడ్డు ఊడ్చారు. అబ్బాపురంలో ములుగు కలెక్టర్ టీఎస్ దివాకరతో కలిసి మొక్క నాటిన అనంతరం మంత్రి సీతక్క ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ప్రజలు భాగస్వామ్యమై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## స్మార్ట్‌సిటీ అభివృద్ధి పనుల కొనసాగింపు

**27వ స్మార్ట్‌సిటీ బోర్డు సమావేశం ఆమోదం**



హనుమకొండ : కళాక్షేత్రం పనులను పరిశీలిస్తున్న దాన కిశోర్

వరంగల్, ఆగస్టు 5 : వరంగల్ నగరంలో స్మార్ట్‌సిటీ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను కొనసాగించనున్నారు. ఈ మేరకు స్మార్ట్ సిటీ బోర్డు అనుమతులు మంజూరు చేసింది. సోమవారం కుడా కార్యాలయంలో రాష్ట్ర మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్ అధ్యక్షతన జరిగిన 27వ స్మార్ట్‌సిటీ బోర్డు సమావేశంలో బోర్డు సభ్యులు మేయర్ గుండు సుధారాణి, ఈఎస్‌సీ జియావుద్దీన్, గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి ఆమోదించారు. గత ఎజెండాలో ఆమోదం పొంది కొనసాగుతున్న బయోమైనింగ్, స్మార్ట్‌సిటీ ఫేజ్ 1,2 పనులు, నాలాల పునరుద్ధరణ, రిటైనింగ్ వాల్స్, దసరా రోడ్డు, గవిచర్ల రోడ్డు, వడ్డేపల్లి, భద్రకాళీ బండ్ జోన్ డీ, నయీంనగర్ హై లెవల్ బ్రిడ్జితో పాటు 19 పనులకు సంబంధించిన రెండో గడువును నవంబర్ 2024 వరకు, మూడో గడువును డిసెంబర్ 2024, మార్చి 2025 వరకు పొడిగిస్తూ బోర్డు ఆమోదించింది. స్మార్ట్‌సిటీ ద్వారా గతంలో మంజూరైన రెండు పనులకు అదనపు నిధులు మంజూరు, మరో అభివృద్ధి పనుల కాంట్రాక్ట్ వాల్యూ పెంచుతూ పరిపాలనా అనుమతులను మంజూరు చేసింది. అలాగే, గతంలో మంజూరు చేసిన నాలుగు అభివృద్ధి పనులను రద్దు చేసి, వాటి స్థానంలో మరో నాలుగు అభివృద్ధి పనులకు బోర్డు అనుమతులు ఇచ్చింది. ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని కమిషనర్ వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు సంధ్యారాణి, వెంకట్‌రెడ్డి, కుడా పీవో అజిత్‌రెడ్డి, బల్దియా ఎస్ఈలు ప్రవీణ్‌చంద్ర, రాజయ్య, శ్రీనివాసరావు, స్మార్ట్‌సిటీ పీఎంవో ఆనంద్ వోలేటి పాల్గొన్నారు.

**20లోగా కళాక్షేత్రం పనులు పూర్తి చేయాలి**

హనుమకొండ : కాళోజీ కళాక్షేత్రం పనులను ఈ నెల 20లోగా పూర్తి చేయాలని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ ఆదేశించారు. సోమవారం వరంగల్‌కు వచ్చిన ఆయన మేయర్, కుడా చైర్మన్, హనుమకొండ కలెక్టర్, గ్రేటర్ కమిషనర్‌తో కలిసి కాళోజీ కళాక్షేత్రం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిబంధనల మేరకు నిర్మాణ పనులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.అలాగే, కళాక్షేత్రంలో సీటింగ్ ఏర్పాట్లు, బాల్కనీ సీటింగ్‌లపై నిర్మాణ సంస్థ ప్రతినిధులకు కలెక్టర్ ప్రావీణ్య సూచనలు ఇచ్చారు. పనులను రోజూ తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. వారివెంట కుడా పీవో అజిత్‌రెడ్డి, ఈఈ భీంరావు తదితరులు ఉన్నారు.

## ఆలయాలకు శ్రావణ శోభ

- మొదటి సోమవారం సందర్భంగా తరలివచ్చిన భక్తులు
- దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేసిన అర్చకులు



కాశీబుగ్గ: కాశీవిశ్వేశ్వరాలయంలో అన్నాభిషేకం చేస్తున్న భక్తులు

ఆలయాలు శ్రావణ శోభను సంతరించుకున్నాయి. శ్రావణ మాసం మొదటి సోమవారం సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి దేవతామూర్తులకు పూజలు చేశారు. హనుమకొండలోని చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరస్వామి దేవాలయంలో రుద్రేశ్వర స్వామికి 200 మంది దంపతులతో సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించారు. 51 కిలోల పెరుగన్నంతో అన్నసూక్త మంత్రపఠనంతో మహాన్న పూజ చేశారు. గణపురం మండలం కోటగుళ్లలోని నందీశ్వరుడు, గణపేశ్వరుడికి పంచామృతాలతో రుద్రాభిషేకం నిర్వహించారు. వరంగల్ స్టేషన్‌రోడ్‌లోని ఆకారపు వారి గుడిలోని కాశీ విశ్వేశ్వరస్వామివారికి వేద మంత్రోచ్ఛారణలతో లక్ష బిల్వార్చన కార్యక్రమం నిర్వహించారు. కాశీబుగ్గలోని కాశీవిశ్వేశ్వరుడికి 39 లీటర్లతో పాలాభిషేకం చేశారు.

– నమస్తే నెట్‌వర్క్, ఆగస్టు 5



ప్రత్యేక అలంకరణలో కోటగుళ్ళ గణపేశ్వరుడు

**ప్రొటోకాల్ ఉల్లంఘన**

రాష్ట్ర ప్రభుత్వం ఐదు రోజుల పాటు గ్రామాల్లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న తరుణంలో కాంగ్రెస్ నాయకులు ప్రొటోకాల్ ఉల్లంఘించారు. సోమవారం జనగామ మండలం శామీర్‌పేటలో జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, జిల్లా అధికారుల సాక్షిగా వేదికపై ఆశీనులయ్యారు. స్థానిక సమస్యలపై ప్రజల నుంచి అభిప్రాయాలు తీసుకుంటుండగా కాంగ్రెస్ జిల్లా నాయకుడు సర్వల నర్సింగరావు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బనుక శివరాజ్ యాదవ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గనిపాక మహేందర్ మాట్లాడారు. వారిని ఆహ్వానించకున్నా అధికారిక కార్యక్రమంలో ప్రజాప్రతినిధులకు బదులు వీరు స్టేజీపై కూర్చోవడం చర్చనీయాంశమైంది.

– జనగామ రూరల్, ఆగస్టు 5



కలెక్టర్ ముందే స్టేజీపై మాట్లాడుతున్న యూత్ కాంగ్రెస్ నేత శివరాజ్‌యాదవ్



తూర్పుకోటలో చెత్త లేని రోడ్డుపై ఊడుస్తున్న కాంగ్రెస్ నాయకులు

**కాంగ్రెస్ నేతల షో..!**

వరంగల్‌లోని పలు డివిజన్లలో సోమవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకుల 'షో' కనిపించింది. పరిసరాలను శుభ్రం చేయడం, మొక్కలు నాటడం, ప్రజలకు అవగాహన కల్పించడం దీని ముఖ్య ఉద్దేశం. కానీ నేతలు మాత్రం ఫొటోలకు ఫోజులిచ్చేందుకే ప్రాధాన్యత ఇచ్చారు. తూర్పుకోటలో శుభ్రంగా ఉన్న రోడ్డుపై చీపుర్లు పట్టుకొని ఫొటోలు దిగుతూ హడావిడి చేయడం స్థానికులను విస్మయానికి గురిచేసింది.

– ఖిలావరంగల్, ఆగస్టు 5

## రోడ్డుకు ప్యాచ్‌లే ప్యాచ్‌లు!

**మొన్న సీసీ.. నేడు తారు**

- నాసిరకంగా హనుమకొండ బస్టాండ్ రోడ్ మరమ్మతు పనులు..
- ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యంతో ప్రజాధనం వృథా
- శాశ్వత రోడ్డు వేయాలని నగరవాసుల డిమాండ్



గత నెలలో హనుమకొండ బస్‌స్టేషన్‌రోడ్‌లో వేసిన సీసీ రోడ్డు

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 5: హనుమకొండ బస్టాండ్ రోడ్డు అతుకుల బొంతలా తయారైంది. గుంతల రోడ్డుకు మొదట సీసీతో నాసిరకంగా ప్యాచ్ వేయడంతో అది కాస్తా మూడు రోజులకే ఎక్కడికక్కడ కంకర తేలింది. ఆ తర్వాత తారు వేసి మమ అనిపించారు. దీంతో ప్రజాధనం వృథాతోపాటు మళ్లీ నాలుగు రోజులకే రహదారి గుంతలమయంగా మారుతుందని, శాశ్వత రోడ్డు వేయాలని నగరవాసులు డిమాండ్ చేస్తున్నారు. వర్షాలతో హనుమకొండ బస్‌స్టేషన్ రోడ్డు గుంతలు పడి ప్రమాదకరంగా మారడంతో స్థానికులు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా గత నెలలో హడావిడిగా పైపైన గుంతలను పూడ్చి సీసీతో ప్యాచ్ వేయించారు. అనంతరం రోడ్డును సందర్శించిన ఎమ్మెల్యే ఇన్‌స్టాలో నాడు–నేడు ఫొటోలు పోస్టు చేశారు. నెల రోజులకే మళ్లీ గుంతలు పడడంతో నాసిరకంగా పనులు చేసి తారుతో ప్యాచ్ వేశారు. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో లక్షలు ఖర్చు చేసి ప్రజాధనాన్ని వృథా చేశారని నగరవాసులు మండిపడుతున్నారు. కాంట్రాక్టర్ నాసిరకంగా గుంతలను పూడ్చి తారు రోడ్డు వేయడంతో మళ్లీ నాలుగు రోజులే ఉంటుందని, నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే హనుమకొండ బస్ స్టేషన్ వద్ద శాశ్వత రోడ్డు వేయాలని డిమాండ్ చేస్తున్నారు.





హనుమకొండ బస్‌స్టేషన్ రోడ్డులో పడిన గుంతలను తారుతో పూడ్చిన దృశ్యం

సీసీ రోడ్డు వేసిన తర్వాత మళ్లీ గుంతలు పడిన బస్‌స్టేషన్ రోడ్(ఫైల్)

## ఏకలవ్యను సందర్శించిన అధికారుల బృందం

బయ్యారం, ఆగస్టు 5 : మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం నామాలపాడులో ఏకలవ్య మోడల్‌స్కూల్‌ను సోమవారం అధికారుల బృందం పరిశీలించింది. పాఠశాలలో నీళ్లు లేకపోవడంతో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను ఆర్డీవో అలివేలు, ఆర్సీవో హరిసింగ్, తహసీల్దార్ విజయ అడిగి తెలుసుకున్నారు. నీటి సమస్య పరిష్కారానికి ప్రస్తుతం తాత్కాలిక ఏర్పాట్లు చేస్తామన్నారు. అనంతరం శాశ్వత పరిష్కారం కోసం బోర్, పైపు లైన్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. అలాగే వారు పాఠశాల పరిసరాలను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు భోజనం సరిగ్గా ఉండడం లేదని చెప్పడంతో సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక నుంచి నాణ్యతగా భోజనం ఉండేలా చూడాలని నిర్వాహకులకు సూచించారు. ఏకలవ్య స్కూల్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు.



ఏకలవ్య స్కూల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారుల బృందం





